## వచ్చే నెల నుంచి కొత్త ప్రయాణం



రామ్‌చరణ్ సరికొత్త అవతారంలోకి మారారు. అక్టోబర్ నుంచి ఆయన బుచ్చిబాబు సాన సినిమా షూటింగ్‌లో జాయిన్ కానున్నారు. ఆ సినిమాకోసం గత రెండు నెలలుగా జిమ్‌లో ఎక్కువ సమయం గడుపుతున్నారు రామ్‌చరణ్. శంకర్ 'గేమ్ చేంజర్' సినిమాకు సంబంధించిన షూటింగ్ వర్క్‌ని ఇప్పటికే ఆయన పూర్తి చేసుకున్నారు. ఆ సినిమా డబ్బింగ్ మాత్రమే బ్యాలన్స్ ఉంది. దానికి ఈ నెలలోనే ఓ పది రోజులు కేటాయించనున్నారు. వచ్చే నెల నుంచి బుచ్చిబాబు సినిమా షూటింగ్‌లో జాయిన్ అవుతారు. ఈ సినిమాలో రామ్‌చరణ్ లుక్‌ని డిఫరెంట్‌గా ప్లాన్ చేశారట బుచ్చిబాబు. అందుకే.. మామూలుగా కంటే ఓ గంట ఎక్కువగానే జిమ్‌లో కష్టపడుతున్నారట చరణ్. క్రీడా నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కనుంది. ఇది ఇప్పటి జనరేషన్ కథ కాదని, బుచ్చిబాబు ఓ 30ఏళ్లు వెనక్కెళ్లి రాసుకున్న వైవిధ్యమైన కథ అని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. అయితే.. ఏ క్రీడా నేపథ్యంలో ఈ కథ సాగుతుందో మాత్రం చిత్రబృందం చెప్పడంలేదు. అది తెరపైనే చూడాలి. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటించనున్న విషయం తెలిసిందే. నవంబర్ నుంచి జాన్వీ ఈ షూటింగ్‌లో పాల్గొంటుందని సమాచారం.

## ఇది మాటలకందని అనుభూతి



దీపిక పదుకొణే కొన్ని నెలలుగా షూటింగ్‌లకు దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. డెలివరీ సమయం దగ్గర పడుతుండటంతో సాధ్యమైనంత వరకూ శరీరంపైనే దృష్టి పెట్టి, సుఖ ప్రసవం కోసం యోగాసనాలతో, మెడిటేషన్‌తో కాలం గడుపుతున్నది దీపిక. బిడ్డ పుట్టాక కూడా.. వచ్చే ఏడాది మార్చి వరకూ షూటింగ్స్‌లో పాల్గొన కూడదని ఆమె నిర్ణయించుకున్నదట. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తన ఇన్‌స్టా ద్వారా తెలిపింది. 'నా జీవితంలో ముఖ్యమైన ఘట్టం జరగబోతున్నది. తను నాలోనే ఉన్నా.. తనని చూడాలన్న ఆశ మాత్రం నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. ఎదురుచూపుల్లో ఇంత బాధ ఉందా? అనిపిస్తున్నది. రీసెంట్‌గా మేం ఓ ఇల్లు కొన్నాం. గృహప్రవేశం అయితే చేయలేదు. తనొచ్చేస్తే.. ముగ్గురం కలిసి కొత్త ఇంట్లోకి అడుగుపెడతాం. నేను అమ్మను అవుతున్నా.. ఇది మాటలకందని అనుభూతి' అంటూ చెప్పుకొచ్చింది దీపిక.

## ఆయన ప్లాన్ చేస్తే నేను రెడీ..



ప్రశాంత్‌నీల్‌తో ఎన్టీఆర్ చేయబోతున్న సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ ఆదివారం వెలుగు చూసింది. ఆ చిత్ర నిర్మాణసంస్థ మైత్రీమూవీ మేకర్స్ తన ఎక్స్(ట్విటర్)లో ఈ అప్‌డేట్‌ని పొందుపరిచింది. 'ఎన్టీఆర్, కొరటాల శివతో మేం చేసిన 'జనతా గ్యారేజ్' విడుదలై ఎనిమిదేండ్ల కావొస్తున్నది. ఈ సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ వారిద్దరూ 'దేవర-1'తో రాబోతున్నారు. ఈ సినిమా కూడా ఘన విజయం సాధించాలని ఆశిస్తున్నాం. అలాగే.. ఎన్టీఆర్, ప్రశాంత్‌నీల్‌తో మేం చేయనున్న భారీ ప్రాజెక్ట్‌ని కొన్ని నెలల్లోనే మొదలు పెట్టనున్నాం. ఈ విషయం తెలియజేయడానికి సంతోషిస్తున్నాం' అని ఎక్స్ ద్వారా వారు తెలిపారు. ఇదిలావుంటే.. కర్ణాటకలోని ఉడిపి దేవాలయ ప్రాంగణంలో ఎన్టీఆర్ మీడియాతో ముచ్చటించినప్పుడు.. ' 'కాంతార' ప్రీక్వెల్‌లో మీరు నటిస్తారని జాతీయ మీడియాలో గత కొన్ని రోజులుగా కథనాలు వస్తున్నాయి. వాటిలో నిజమెంత? అని ఓ విలేకరి ప్రశ్నించగా.. 'రిషబ్‌శెట్టే దానికి ప్లాన్ చేయాలి. ఆయన ప్లాన్ చేస్తే చేయడానికి నేను రెడీ..' అన్నారు తారక్. ఈ రెండు విషయాలకూ సంబంధం లేకపోయినా.. తారక్ అభిమానులకు మాత్రం ఇవి శుభవార్తలే.

## లెక్కలు తెచ్చిన తంట



నివేద థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రధారులుగా రూపొందిన చిత్రం '35-చిన్న కథ కాదు'. నందకిశోర్ ఈమని రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి నటుడు రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మాతలు. ఈ నెల 6న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేశారు. అగ్ర హీరో అక్కినేని నాగార్జున ట్రైలర్‌ని ఆవిష్కరించి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. ఇక ట్రైలర్ విషయానికొస్తే.. 'మ్యాథ్స్ సబ్జెక్ట్‌తో ఇబ్బంది పడుతున్న ఓ పిల్లాడ్ని పరిచయం చేస్తూ ట్రైలర్ మొదలైంది. తల్లిదండ్రులుగా కనిపిస్తున్న నివేద థామస్, విశ్వదేవ్ ఆ పిల్లాడి భవిష్యత్ విషయం ఆందోళన చెందుతున్నారు. ఆ పిల్లాడ్ని తోటి స్టూడెంట్స్‌తోపాటు టీచర్లు కూడా 'సున్నా' అని పిలుస్తుంటారు. మరి ఆ పిల్లాడు సవాళ్లను అధిగమించి 35 మార్కులతో ఎలా ఉత్తీర్ణుడయ్యాడు? అనేది ఈ కథలో ప్రధానాంశం అని ట్రైలర్ చూస్తే అర్థమవుతున్నది. అందరికీ కనెక్టయ్యే మంచి కథాంశంతో రూపొందిన ఈ చిత్రానికి కెమెరా: నికేత్ బొమ్మి, సంగీతం: వివేక్ సాగర్.

## కళలను గుర్తించే రోజులు రావా!?



దిలీప్ ప్రకాష్, రెజీనా కసాండ్రా జంటగా రూపొందిన చిత్రం 'ఉత్సవం'. అర్జున్‌సాయి రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సురేశ్ పాటిల్ నిర్మాత. ఈ నెల 13న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. బ్రహ్మానందం స్టేజ్ ప్లేలో చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్‌తో ట్రైలర్ మొదలైంది. 'మన బ్రతుకులు కలలు కావు.. కళలని గుర్తించే రోజులు రావా..' అని ప్రకాశ్‌రాజ్ చెప్పిన డైలాగ్ కథలోని ఆత్మని ప్రజెంట్ చేసింది. నాటకరంగం చుట్టూ సాగే కథాంశంతో ఈ సినిమా తెరకెక్కినట్టు ట్రైలర్ చెబుతున్నది. ఇందులో కృష్ణగా దిలీప్‌ప్రకాశ్, రామగా రెజీనా కసాండ్రా కనిపిస్తారు. వారి ప్రేమకథ ఈ సినిమాలో ప్రధాన ఆకర్షణ అని మేకర్స్ చెబుతున్నారు. ప్రేమ, భావోద్వేగాల మేళవింపుగా తెరకెక్కిన ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్, నాజర్, అలీ, ప్రేమ, ఎల్బీ శ్రీరామ్, అనీష్ కురువిల్లా, ప్రియదర్శి, ఆమని, సుధ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రసూల్ ఎల్లోర్, సంగీతం: అనూప్ రూబెన్స్.

## ఓ వారం ఆలస్యంగా..



రాజ్‌తరుణ్ అప్‌కమింగ్ మూవీ 'భలే ఉన్నాడే'. జె.శివసాయివర్ధన్ దర్శకత్వంలో ఎన్వీ కిరణ్‌కుమార్ నిర్మించిన ఈ సినిమాను ఈ నెల 7న విడుదల చేస్తున్నట్టు గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే.. అనివార్యకారణాలవల్ల ఈ సినిమా విడుదలను ఓ వారం వాయిదా వేస్తున్నట్టు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా న్యూ రిలీజ్ డేట్‌ని ప్రకటించారు. ఈ నెల 13న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మనీషా కంద్కూర్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో సింగీతం శ్రీనివాస్, అభిరామి, అమ్ము అభిరామి, లీలా శాంసన్, వీటీవీ గణేశ్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: నగేశ్ బానెల్లా, సంగీతం: శేఖర్‌చంద్ర.



## అమెరికాలో నేపథ్యంలో థ్రిల్లర్

శివకుమార్, నందినిరాయ్ జంటగా ఓ చిత్రం రూపొందనుంది. రవికుమార్ నాసు దర్శకుడు. ట్రెండ్‌సెట్ ఫిల్మ్స్ పతాకంపై తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రారంభోత్సవం అమెరికా వర్జీనియాలోని సాయిబాబా టెంపుల్‌లో ఘనంగా జరిగింది. ఈ సినిమా షూటింగ్ మొత్తం అమెరికాలోనే చేస్తామని నిర్మాతలు తెలిపారు. థ్రిల్లర్ కథాంశంతో రూపొందనున్న ఈ సినిమాకు సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతికనిపుణులు, షూటింగ్ వివరాలను త్వరలో తెలియజేస్తామని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: సాయికుమార్ అయినంపూడి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: శ్రావణి ముదిరాజ్, మాధవి నాసు, లైన్ ప్రొడ్యూసర్: పద్మ వాయువేగుల, చైతన్యవర్మ.



## రెండేళ్ల కష్టం ఫలించింది

ఎం.ఎస్.వి.సాగర్ స్వీయదర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. కొత్తవాళ్లతో తీసిన ఈ సినిమా ఇటీవలే విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దర్శక, నిర్మాత సాగర్ మాట్లాడుతూ 'ఇది నా రెండేళ్ల కష్టం. కొత్తవాళ్లను కూడా ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. పనిచేసిన అందరికీ ఈ సినిమా మంచి పేరు తెచ్చింది. ఈ విజయం నేను తర్వాత చేయబోయే సినిమాలపై విశ్వాసాన్ని పెంచింది.' అని చెప్పారు. ఇంకా ఇందులో ప్రధాన పాత్రలు పోషించిన హన్విక శ్రీనివాస్, ఉమా రేచర్ల, వికాస్ ఈ సినిమాలో నటించే అవకాశాన్నిచ్చిన దర్శక, నిర్మాత సాగర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



## వాటిని చూసి మా అత్తామామ పారిపోతారు

రీసెంట్‌గా ఓ ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న కంగనారనౌత్‌కు 'పెళ్లెప్పుడు చేసుకుంటున్నారు? ఒకవేళ చేసుకుంటే నటుడ్ని చేసుకుంటారా? రాజకీయ నాయకుడ్ని చేసుకుంటారా? అనే ప్రశ్న ఎదురైంది. దానిపై తనదైన శైలిలో స్పందించింది కంగనా. 'పెళ్లంటే ప్రత్యేకమైన ద్వేషం ఏమీలేదు. మనిషి అన్న తర్వాత తోడు అవసరం. లెగసీ కొనసాగాలంటే పిల్లలు అవసరం. అందుకే పెళ్లి తప్పకుండా చేసుకోవాల్సిందే. అయితే.. నా మాట తీరువల్లో లేక ముక్కుసూటితనం వల్లో నాపై నెగటివ్ ప్రచారం జరిగింది. దాంతో కొంతవరకూ అపఖ్యాతి పాలయ్యా. వీటికి తోడు కోర్టు కేసులు. అందుకే.. పెళ్లికి దూరంగా ఉంటున్నా. ఒకవేళ చేసుకున్న తర్వాత కోర్టు నుంచి సమన్లు వస్తే.. వాటిని చూసి మా అత్తామామ పారిపోతారు..' అంటూ పకపకా నవ్వేసింది కంగనా రనౌత్. ఆమె స్వీయ దర్శకత్వంలో రూపొందించిన ఇందిరా గాంధీ బయోపిక్ 'ఎమర్జెన్సీ' త్వరలో విడుదల కానున్న విషయం తెలిసిందే.

## తొలి ప్రయారిటీ తెలుగుకే



త్రిష నటించిన సూపర్‌హిట్ వెబ్ సిరీస్ 'బృందా'లో త్రిష చెల్లెలు 'చుట్కీ'గా అందరి దృష్టినీ ఆకర్షించింది నటి యష్నా. నటనకు అవకాశం ఉన్న పాత్ర కావడంతో ఆడియన్స్‌కి బాగా రిజిస్టర్ అయ్యింది

యష్నా. ఈ సిరీస్ కంటే ముందే నాగార్జున 'బంగార్రాజు'లో కూడా నాగచైతన్య కాంబినేషన్‌లో మంచి పాత్ర పోషించింది. ఆకర్షణీయమైన రూపం, అభినయ సామర్థ్యం యష్నాకు వరాలు. 'బృందా' సిరీస్ తర్వాత ఈ తెలుగమ్మాయికి తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ భాషల నుంచి కూడా అవకాశాలు వస్తున్నాయి. కానీ తన తొలి ప్రయారిటీ తెలుగు సినిమాకే అని చెపుతున్నది యష్నా. త్వరలో మరికొన్ని సినిమాల్లో ఈ తెలుగు అందం తళుక్కున మెరవనున్నది.

## పర్‌ఫెక్ట్ సీక్వెల్ అంటున్నారు



' తెలుగులో మా 'డీమాంటీ కాలనీ 2' చాలా పెద్ద హిట్. సినిమా చూసిన వారంతా 'డీమాంటీ కాలనీ'కి ఇది పర్‌ఫెక్ట్ సీక్వెల్ అంటున్నారు. ఈ ఫ్రాంచైజీలో 3, 4 సినిమాలు కూడా రాబోతున్నాయి. వచ్చే 'డీమాంటీ కాలనీ 3' బిగ్ స్పాన్ మూవీ అవుతుంది. ఎన్నో ట్విస్ట్‌లతో టర్న్‌లతో ఈ సినిమా ఉండబోతున్నది. ఇంకా కొత్తకొత్త కథలు, కేరక్టర్లు 'డీమాంటీ కాలనీ 3'లో యాడ్ అవ్వబోతున్నాయి.' అని హీరో అరుల్‌నిధి అన్నారు. ఆయన కథానాయకుడిగా అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. తమిళంలో ఘన విజయం సాధించిన ఈ సినిమాను బి.సురేశ్‌రెడ్డి, బి.మానసరెడ్డి తెలుగులోకి అనువదించి, ఆగస్ట్ 23న గ్రాండ్‌కి విడుదల చేశారు. ఈ సినిమా తెలుగులో కూడా విజయవంతంగా ప్రదర్శింపబడుతున్నదని హీరో అరుల్‌నిధి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరులతో ఆయన ముచ్చటించారు. ' తెలుగులో కూడా ఈ సినిమా ఇంత విజయం సాధించడానికి కారణం నిర్మాతలే. వాళ్లు సినిమాను ప్రమోట్ చేసిన తీరు అద్భుతం. త్వరలో సక్సెస్‌మీట్‌ని నిర్వహించనున్నాం.' అని అరుల్‌నిధి తెలిపారు. ఈ సినిమాలో శ్రీని, రఘు అనే రెండు పాత్రల్లో తాను కనిపిస్తానని, వీటిలో రఘు పాత్ర పెక్యులర్‌గా స్టైలిష్‌గా, కేర్‌లెస్‌గా ఉంటుందని, ద్విపాత్రాభినయం చేయడం ఎంత కష్టమో ఈ సినిమాతో తెలిసొచ్చిందని, అయితే థియేటర్‌లో ఆడియన్స్ రెస్పాన్స్ చూశాక కష్టాన్ని మరిచిపోయానని అరుల్‌నిధి అన్నారు. ఇక నుంచి థ్రిల్లర్ చిత్రాలే కాక, వేరే జానర్ సినిమాలు కూడా చేయాలనుకుంటున్నానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.